నమస్తే తెలంగాణ

మహబూబాబాద్

5 | శనివారం 3 ఆగస్టు 2024 | MAHABUBABAD

బండారుపల్లిలోని తెలంగాణ గురుకుల పాఠశాల

గురుకులంలో ఏం జరిగింది?

బండారుపల్లి టీజీఆర్ఎస్‌లో ఇద్దరు విద్యార్థులకు అస్వస్థత

- పాముకాటా? డ్రగ్స్ తీసుకున్నారా?
- స్పృహ కోల్పోవడంపై వెంటిలేటర్‌పై చికిత్స
- కలకలం రేపిన ఘటన

ములుగు రూరల్, ఆగస్టు 2 : ఏమైందో తెలియదు గానీ, ఇద్దరు విద్యార్థులు ఆకస్మాత్తుగా తీవ్ర అస్వస్థతకు గురై ప్రాణాపాయ స్థితిలో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్న ఘటన ములుగు మండలం బండారుపల్లిలోని టీజీ గురుకుల పాఠశాలలో శుక్రవారం తెల్లవారుజామున జరిగింది. వివరాలిలా ఉన్నాయి. గురుకులానికి చెందిన 10వ తరగతి విద్యార్థులు కార్తీక్, ప్రణయ్ గంట వ్యవధిలోనే తీవ్ర అస్వస్థతకు గురై ప్రాణాపాయ స్థితిలోకి వెళ్లారు. గురువారం రాత్రి ఇదే గురుకులానికి చెందిన 8వ తరగతి విద్యార్థి శ్రీకర్‌కు విషపురుగు కుట్టడంతో ములుగు ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందిన అనంతరం ఇంటికి వెళ్లినట్లు తెలిసింది. కాగా, శుక్రవారం తెల్లవారుజామున కార్తీక్, ప్రణయ్ కూడా అస్వస్థతకు గురికావడం పలు అనుమానాలకు తావిస్తున్నది. ఈ విషయమై గురుకుల ఉపాధ్యాయులను వివరణ కోరగా.. ఇద్దరు విద్యార్థులు కండ్లు తిరిగి అస్వస్థతకు గురికావడంతో వెంటనే దవాఖానకు తీసుకెళ్లామని, తమకేమీ తెలియదన్నారు. చికిత్స అందించిన వైద్యులు మాత్రం మొదట విద్యార్థులు పాముకాటుకు గురై ఉండొచ్చని అనుమానాలు వ్యక్తం చేసినా, వారి ఒంటిపై ఎలాంటి ఆనవాళ్లు కనిపించలేదన్నారు. ప్రథమ చికిత్స అందించి వరంగల్ ఎంజీఎం దవాఖానకు రెఫర్ చేశారు. కాగా, ఈ విషయం ములుగు జిల్లా కేంద్రంలో హాట్‌టాపిక్‌గా మారింది. అయితే, కొన్ని రోజులుగా గురుకులంలోని విద్యార్థులకు డ్రగ్స్ అందుతున్నాయనే పుకారు షికార్లు చేస్తున్నాయి. ఇందులో భాగంగానే ఇద్దరు విద్యార్థులు డ్రగ్స్ తీసుకొని అస్వస్థతకు గురై ఉండొచ్చని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పాము కాటా లేక డ్రగ్స్ తీసుకున్నారా అనే విషయంలో వైద్యులు కూడా క్లారిటీ ఇవ్వడం లేదు. విద్యార్థులు స్పృహలో లేనందున అర్థం కాని పరిస్థితి ఉందని వైద్యులు చెబుతున్నారు.

వెంటిలేటర్‌పై చికిత్స

ములుగు ప్రభుత్వ దవాఖానలో ప్రథమ చికిత్స అనంతరం ఉపాధ్యాయులు వారి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. విద్యార్థుల పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్ ఎంజీఎం దవాఖానకు వైద్యులు రెఫర్ చేశారు. కానీ, ప్రిన్సిపాల్, మరికొందరు ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు వారిని గూడెప్పాడ్‌లోని ఎస్ఎస్ఆర్ ప్రైవేట్ దవాఖానకు తరలించినట్లు తెలిసింది. అక్కడ ఐసీయూలో వెంటిలేటర్లపై వైద్యం అందిస్తున్నట్లు సమాచారం. విద్యార్థులను ఎంజీఎం దవాఖానకు తరలించకుండా ప్రైవేటు హాస్పిటల్‌కు తరలించడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయమై ప్రిన్సిపాల్‌ను వివరణ కోరేందుకు ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు. విద్యార్థుల అస్వస్థతకు గల కారణాలపై ఉన్నతాధికారులు పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రాయపర్తి పీఏసీఎస్‌లో యూరియా బస్తాల కోసం ఎగబడుతున్న రైతులు

యూరియా.. సరిపడా లేదయా!

- బస్తాల కోసం అన్నదాతల బారులు
- సరిపడా నిల్వలు లేక ఇబ్బందులు

రాయపర్తి, ఆగస్టు 2: రైతులకు యూరియా కష్టాలు మొదలయ్యాయి. వరి, పత్తి, మక్కజొన్న, జొన్న తదితర పంటలకు మొదటి దఫాలో వేయాల్సిన యూరియా బస్తాల కోసం రైతులు ఫర్టిలైజర్ షాపుల చుట్టూ తిరుగుతున్నారు. అయినా ఒక్క బస్తా లభించడం లేదని వాపోతున్నారు. వరంగల్ జిల్లా రాయపర్తిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద యూరియా బస్తాల కోసం అన్నదాతలు వేకువజాము నుంచే బారులు తీరుతున్నారు. రాయపర్తి మండలంలోని 39 గ్రామాలకు 2500 టన్నుల యూరియా అవసరముండగా శుక్రవారం వెయ్యి బస్తాలు మాత్రమే వచ్చాయి. విషయం తెలుసుకున్న రైతులు కూపన్ల కోసం పోటీపడి గోదాం వద్ద బస్తాలు తీసుకునేందుకు ఎగబడ్డారు. కాగా 'కేసీఆర్ సర్కారు ఉన్నప్పుడు యూరియా కొరత లేదని, ఏనాడూ క్యూకట్టిన సందర్భాలూ లేవని..కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మళ్లీ కొరత మొదలైంది' అని బారులు తీరిన పలువురు రైతులు పేర్కొన్నారు. ఈ విషయమై ఏవో గుమ్మడి వీరభద్రంను వివరణ కోరగా పూర్తిస్థాయిలో యూరియా నిల్వలు లేవని, త్వరలోనే తెప్పిస్తామన్నారు.

మళ్ల కష్టాలు మొదలైనయ్..

యూరియా బస్తాల కోసం మళ్ల ఎనుకటి రోజులు ముందర పడ్డై. గత పందేండ్ల కాలంల యూరియా మా ఊళ్లల్లనే దొరికేది. ఇప్పుడేమో మండల కేంద్రంలోని ప్రైవేట్ దుకాణాలల్ల కూడా దొరుకడం లేదు. యూరియా కోసం సమీప మండలాలు కూడా తిరిగినం. యూరియా లేకుంటే పంటలు పండవాయే. కొందామంటే దొరుకతలేవాయే. ఏం చేయాల్నో.. ఏమో అర్థం కావడం లేదు. జిల్లా ఉన్నతాధికారులు రైతుల గోసను జర పట్టించుకోవాలి.

– ఎర్ర లింగయ్య, మహబూబ్‌నగర్, రాయపర్తి మండలం, వరంగల్ జిల్లా

యూరియా.. సరిపడా లేదయా!

- బస్తాల కోసం అన్నదాతల బారులు
- సరిపడా నిల్వలు లేక ఇబ్బందులు

రాయపర్తి, ఆగస్టు 2: రైతులకు యూరియా కష్టాలు మొదలయ్యాయి. వరి, పత్తి, మక్కజొన్న, జొన్న తదితర పంటలకు మొదటి దఫాలో వేయాల్సిన యూరియా బస్తాల కోసం రైతులు ఫర్టిలైజర్ షాపుల చుట్టూ తిరుగుతున్నారు. అయినా ఒక్క బస్తా లభించడం లేదని వాపోతున్నారు. వరంగల్ జిల్లా రాయపర్తిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద యూరియా బస్తాల కోసం అన్నదాతలు వేకువజాము నుంచే బారులు తీరుతున్నారు. రాయపర్తి మండలంలోని 39 గ్రామాలకు 2500 టన్నుల యూరియా అవసరముండగా శుక్రవారం వెయ్యి బస్తాలు మాత్రమే వచ్చాయి. విషయం తెలుసుకున్న రైతులు కూపన్ల కోసం పోటీపడి గోదాం వద్ద బస్తాలు తీసుకునేందుకు ఎగబడ్డారు. కాగా 'కేసీఆర్ సర్కారు ఉన్నప్పుడు యూరియా కొరత లేదని, ఏనాడూ క్యూకట్టిన సందర్భాలూ లేవని..కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మళ్లీ కొరత మొదలైంది' అని బారులు తీరిన పలువురు రైతులు పేర్కొన్నారు. ఈ విషయమై ఏవో గుమ్మడి వీరభద్రంను వివరణ కోరగా పూర్తిస్థాయిలో యూరియా నిల్వలు లేవని, త్వరలోనే తెప్పిస్తామన్నారు.

మళ్ల కష్టాలు మొదలైనయ్..

యూరియా బస్తాల కోసం మళ్ల ఎనుకటి రోజులు ముందర పడ్డై. గత పందేండ్ల కాలంల యూరియా మా ఊళ్లల్లనే దొరికేది. ఇప్పుడేమో మండల కేంద్రంలోని ప్రైవేట్ దుకాణాలల్ల కూడా దొరుకడం లేదు. యూరియా కోసం సమీప మండలాలు కూడా తిరిగినం. యూరియా లేకుంటే పంటలు పండవాయే. కొందామంటే దొరుకతలేవాయే. ఏం చేయాల్నో.. ఏమో అర్థం కావడం లేదు. జిల్లా ఉన్నతాధికారులు రైతుల గోసను జర పట్టించుకోవాలి.

– ఎర్ర లింగయ్య, మహబూబ్‌నగర్, రాయపర్తి మండలం, వరంగల్ జిల్లా

నాడు నిండుకుండలు.. నేడు బీటలు

ఏటా వర్షాకాలంలో ఈ సమయానికి నిండానీటితో కళకళలాడిన చెరువులు ఈసారి వెలవెలబోయాయి. ఈ సంవత్సరం ఆశించిన వానల్లేక ఎక్కడచూసినా చాలాచోట్ల చెరువులు, కుంటలు ఎండిపోయి, అడుగంటిన దృశ్యాలే కనిపిస్తున్నాయి. మరికొని చోట్ల బీటలు వారాయి. పదేళ్లుగా జలకళ ఉట్టిపడే జనగామ మండలం పెంబర్తిలోని పెద్దచెరువు, ఎల్లంల, మరిగడి, పెద్దరాంచర్ల, మరిగడి, తదితర చెరువుల్లో ప్రస్తుతం నీళ్లు లేవు. ఇటు బోరుబావుల్లోనూ నీరు లేక రైతులు ఆందోళన చెందుతున్నారు.

- జనగామ రూరల్, ఆగస్టు 2

కాంగ్రెస్‌లో యూత్ లొల్లి

అధ్యక్ష పదవికి పంచాయితీ

- ఇద్దరు ఎమ్మెల్యేల ఆధిపత్యపోరు
- నాయిని వర్సెస్ నాగరాజు
- పోటీలో నాయిని అనుచరుడు
- కొడుకు పదవి కోసం నాగరాజు

ఉమ్మడి వరంగల్‌లో హనుమకొండ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి ఎక్కువ పోటీ ఉండడమే గాక అదేస్థాయిలో ఆధిపత్య పోరు నడుస్తోంది. సమన్వయంతో జరగాల్సిన ఈ ఎన్నిక ప్రక్రియ కాస్త ఇప్పుడు అధికార పార్టీ ఎమ్మెల్యేలు నాయిని వర్సెస్ కేఆర్ నాగరాజు అన్నట్టు మారింది. అధ్యక్ష స్థానం కోసం ఎమ్మెల్యే నాయిని అనచరుడు పల్లకొండ సతీశ్, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు కుమారుడు బిలీప్‌కుమార్, పీసీసీ నేత నమిండ్ల శ్రీనివాస్ కుమారుడు మనోజ్ ఇలా ముగ్గురు పోటీపడుతుండగా పదవి చేజిక్కించుకునేందుకు ఎమ్మెల్యేలిద్దరు సాగిస్తున్న వ్యూహాలు, ఆధిపత్య పోరు సామాన్య కార్యకర్తలు, ద్వితీయ శ్రేణి నాయకత్వం నలిగిపోవాల్సి వస్తోంది. ఏదేమైనా అంతర్గతంగా జరుగాల్సిన ఎన్నిక రెండు వర్గాల పోరుగా మారడం చర్చనీయాంశమైంది.

- వరంగల్, ఆగస్టు 2 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

హనుమకొండ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్ష పదవి కోసం ముగ్గురు పోటీలో ఉన్నారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అనుచరుడు పల్లకొండ సతీశ్, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు కుమారుడు దిలీప్‌కుమార్, పీసీసీ ప్రధాన కార్యదర్శి నమిండ్ల శ్రీనివాస్ కుమారుడు మనోజ్ పోటీలో ఉన్నారు. మనోజ్ పోలీస్ ఉద్యోగానికి రాజీనామా చేసి యూత్ కాంగ్రెస్ పదవికి పోటీపడుతున్నారు. ఇప్పుడు యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష పదవి ఇద్దరు ఎమ్మెల్యేలకు ప్రతిష్టాత్మకంగా మారింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో హనుమకొండ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి ఎక్కువ పోటీ ఉన్నది. ఈ పదవి దక్కించుకుని పార్టీపై పూర్తిస్థాయిలో ఆధిపత్యం కొనసాగించాలని ఇద్దరు ఎమ్మెల్యేలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ప్రత్యర్థి వర్గాల వారిని ఇద్దరు ఎమ్మెల్యేలు బెదిరింపులకు గురిచేస్తున్నట్లు కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారు. కాంగ్రెస్‌లో ఏళ్ల తరబడి పనిచేస్తూ ఆ పార్టీ బలోపేతానికి కృషి చేసినవారికి అవకాశం కల్పించాలని నాయిని వర్గం ప్రచారం చేస్తున్నది. కొత్తగా పార్టీలోకి వచ్చి పదవులు దక్కించుకున్న వారికి అవకాశం ఇవ్వొద్దని వీరు చెబుతున్నారు. ఈ నెల 5 నుంచి సెప్టెంబర్ 5వరకు యూత్ కాంగ్రెస్ సభ్యత్వ నమోదు, సంస్థాగత ఎన్నికల ప్రక్రియ ఉంటుంది. యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో మొదటిసారి రిజర్వేషన్లు అమలు చేస్తున్నారు. సోమవారంతో నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. అధ్యక్ష పదవి ఎన్నిక కోసం ఓటింగ్ ప్రక్రియ కొనసాగుతున్నది. ఆన్‌లైన్‌లో ఎక్కువ ఓట్లు వచ్చిన వారు జిల్లా అధ్యక్ష పదవికి ఎన్నికవుతారు. మూడేండ్లు పదవిలో ఉంటారు. హనుమకొండ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్ష పదవిని ఎస్సీ/ఎస్టీ వర్గానికి కేటాయించారు. ఇతర పోస్టులను జనరల్ కేటగిరీలో పెట్టారు. వీటికి అన్ని వర్గాల వారు పోటీ చేయవచ్చు. ఉమ్మడి జిల్లాలో హనుమకొండ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్ష పదవికే పోటీ ఎక్కువగా ఉన్నది.

టీచర్లు సభకు.. పిల్లలు ఇంటికి !

సీఎం రేవంత్‌రెడ్డి సభకు తరలిన ఉపాధ్యాయులు

- సింగిల్ టీచర్లున్న పాఠశాలలకు సెలవు
- కొన్నిచోట్ల టీచర్లు లేక విద్యార్థుల ఇంటిబాట
- ఉమ్మడి జిల్లాలో 2,888 మందికి పదోన్నతి

హనుమకొండ చౌరస్తా, ఆగస్టు 2 : హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన సభకు వేలాది మంది ఉపాధ్యాయులు తరలివెళ్లారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన వివిధ కేటగిరీల ఉపాధ్యాయులు 2,888 మందికి తాజాగా పదోన్నతులు కల్పించింది. వీరంతా హైదరాబాద్‌లో జరిగిన సభకు తరలివెళ్లారు. వరంగల్ రీజియన్‌లోని 9 డిపోల నుంచి 65 ప్రత్యేక బస్సులను వీరి కోసం ఏర్పాటు చేశారు. హనుమకొండ జిల్లాలో పదోన్నతి పొందిన 451 మంది ఎస్జీటీ నుంచి స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతులు కల్పించారు. అదేవిధంగా గురుకుల ఉపాధ్యాయులు, ఇతర ఎంఎస్‌వోల సిబ్బంది 500 మందిని 10 బస్సుల్లో తరలించారు. వరంగల్ జిల్లాలో 600 మందికిపైగా ఉపాధ్యాయులు 14 బస్సుల్లో, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 365 మంది ఉపాధ్యాయులను 8 బస్సుల్లో, ములుగు జిల్లాలో 246 మంది ఉపాధ్యాయులను 5 బస్సుల్లో, జనగామ జిల్లాలో 554 మంది ఉపాధ్యాయులను 12 బస్సుల్లో, మహబూబాబాద్ జిల్లా నుంచి 623 మంది ఉపాధ్యాయులు 15 బస్సుల్లో సీఎం సభకు తరలివెళ్లారు. కార్యక్రమం ముగిసిన తర్వాత ఆయా జిల్లాల విద్యాశాఖ అధికారులు, ఎంఈవోలు, మండల నోడల్ అధికారులు పదోన్నతి పొందిన ఉపాధ్యాయుల జాబితాను రూపొందించి సభకు తీసుకెళ్లారు. ఉపాధ్యాయులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం కూడా ఏర్పాటు చేశారు. టీచర్లంతా సభకు వెళ్లడంతో పాఠశాలల్లో విద్యార్థులు ఇబ్బంది పడ్డారు. ఒకరిద్దరు ఉపాధ్యాయులతో స్కూళ్లను నడిపించారు. ఒకరిద్దరు ఉపాధ్యాయులతో పాఠశాలలను నెట్టుకొస్తున్న వారు కూడా సభకు వెళ్లడంతో విద్యార్థులు ఇంటిబాట పట్టారు. పాఠాలు బోధించే ఉపాధ్యాయులు లేక తరగతి గదుల్లో ఖాళీగా కూర్చున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా సింగిల్ టీచర్ ఉన్న కొన్ని స్కూళ్లకు ముందుగానే సెలవు కూడా ప్రకటించడం విశేషం.


మహబూబాబాద్ రూరల్: సీఎం ఆత్మీయ సమావేశానికి వెళ్తున్న జిల్లాలోని ఉపాధ్యాయులు

ఏసీబీకి చిక్కిన ఎస్సై

- స్టేషన్ బెయిల్ కోసం రూ. 70 వేలు డిమాండ్
- డ్రైవర్ నుంచి రూ. 40 వేలు తీసుకుంటుండగా పట్టివేత

పర్వతగిరి, ఆగస్టు2: పర్వతగిరి ఎస్సై గుగులోత్ వెంకన్న, డ్రైవర్ సదానందం అవినీతి శాఖ అధికారుల చేతికి చిక్కారు. ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపిన వివరాల ప్రకారం.. జూలై 27న మండలంలోని అన్నారం క్రాస్ రోడ్డు వద్ద ఎస్సై వెంకన్న పోలీసు సిబ్బంది తో కలిసి బెల్లం లోడ్‌ను పట్టుకుని సీజ్ చేశాడు. ట్రాలీ ఓనర్ భాస్కర్, డ్రైవర్ రాజేశ్, వర్కర్‌పై కేసు నమోదు చేసి కాలయాపన చేశాడు. దీంతో భాస్కర్ స్నేహితుడు అజ్మీరా వెంకట్ ద్వారా ఎస్సైని అడుగగా కేసులో సహకరించాలంటే రూ. 70 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. ఈ క్రమంలో రూ. 20 వేల ఫోన్ పే ద్వారా ఎస్సైకి పంపించాడు. మిగిలిన రూ. 50 వేలు తీసుకువస్తేనే కేసులో 41 నోటీసు ఇస్తానని, లేకుంటే జైలుకు పంపిస్తానని ఎస్సై వెంకన్న బెదిరించాడు. దీంతో డబ్బులు ఇవ్వడం ఇష్టం లేని భాస్కర్ ఏసీబీని ఆశ్రయించాడు. శుక్రవారం డ్రైవర్ సదానందం ద్వారా రూ. 40 వేలు లంచం తీసుకుంటుండగా ఎస్సై వెంకన్నతో పాటు డ్రైవర్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు ఏసీబీ డీఎస్పీ సాంబయ్య వెల్లడించారు. ప్రభుత్వ ఉద్యోగులు లంచం డిమాండ్ చేస్తే 1064 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏసీబీ సీఐలు ఎల్ రాజు, ఎస్ రాజు, శ్యాంసుందర్, సిబ్బంది పాల్గొన్నారు.

లంచం తీసుకుంటూ పట్టుబడిన ఎస్సై వెంకన్న, డ్రైవర్ సదానందం

నర్సంపేట రూరల్: మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డిని సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

అనుమతులు వచ్చేశాయ్..

నర్సంపేట మెడికల్ కళాశాలకు ఎన్ఎంసీ లైన్‌క్లియర్

- ప్రారంభం కానున్న 2024-25 విద్యాసంవత్సరం తరగతులు
- కళాశాలను పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి
- స్వీట్లు పంచి సంబురాలు జరుపుకొన్న బీఆర్ఎస్ శ్రేణులు

నర్సంపేట రూరల్, ఆగస్టు 2 : నర్సంపేట ప్రభుత్వ మెడికల్ కళాశాలకు పూర్తి స్థాయి అనుమతులు మంజూరయ్యాయి. 2024-25 విద్యాసంవత్సరంలోనే తరగతులు ప్రారంభం కానున్నాయి. శుక్రవారం నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ప్రభుత్వ మెడికల్ కళాశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసీఆర్, అప్పటి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు సహకారంతో వరంగల్ జిల్లాకు సంబంధించిన ప్రభుత్వ మెడికల్ కళాశాలను ప్రత్యేక జీవో ద్వారా నర్సంపేటకు తీసుకొచ్చినట్లు తెలిపారు. ముందుచూపుతోనే మెడికల్ కళాశాలను నర్సంపేటకు తీసుకొచ్చినట్లు చెప్పారు. దాదాపు పనులన్నీ పూర్తి చేసినట్లు తెలిపారు. ఇటీవల నేషనల్ మెడికల్ కౌన్సిల్ 2024-25 అకాడమీ 8 కళాశాలను రిజెక్ట్ చేసిన విషయం తెలిసిందేనని, కాంగ్రెస్ పార్టీ పూర్తిస్థాయి అధికారులను నియమించకపోవడంతోనే కొత్త కాలేజీలకు అనుమతులు నిరాకరిస్తున్నట్లు నేషనల్ కౌన్సిల్ రాష్ట్ర ప్రభుత్వానికి మెయిల్ పంపిందన్నారు. గ్రామీణ ప్రాంతంలో ఉన్న ఏకైక కళాశాల నర్సంపేటకే దక్కడం గర్వించదగిన విషయమన్నారు. ఈ సందర్భంగా పెద్దిని పలువురు నాయకులు సన్మానించారు. అనంతరం మెడికల్ కళాశాల ఎదుట బీఆర్ఎస్ నాయకులు పటాకులు కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఓడీసీఎంఎస్ చైర్మన్ గులోత్ రామస్వామి, మున్సిపల్ వైస్ చైర్మన్ మునిగాల వెంకట్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు వెంకటనారాయణ, రాయిడి రవీందర్‌రెడ్డి, వేనుముద్దల శ్రీధర్‌రెడ్డి, గోనె యువరాజు, గంప రాజేశ్వర్‌గౌడ్, నాయిని వేణు, సదానందం, యాదగిరి, నాగిరెడ్డి పాల్గొన్నారు.

రుణమాఫీ కాని రైతులకు న్యాయం చేస్తాం

- ఆధార్ నంబర్ తప్పిదంతో అనర్హులైన వారికి 32 ఫార్మెట్
- అందులో వివరాలు నమోదు చేసి ప్రభుత్వానికి నివేదిక
- జిల్లా అసిస్టెంట్ రిజిస్ట్రార్ కీరూనాయక్

నల్లబెల్లి, ఆగస్టు2: ఆధార్ నమోదు తప్పిదంతో రుణమాఫీ కాని రైతులకు న్యాయం చేస్తామని వరంగల్ జిల్లా అసిస్టెంట్ రిజిస్ట్రార్ కీరూనాయక్ హామీ ఇచ్చారు. ఆదేశించింది. ఈ మేరకు జూలై 31న 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన 'ఒకరి ఆధార్..మరొకరికి రుణం' కథనానికి రాష్ట్ర ప్రభుత్వం స్పందించిన విషయం తెలిసిందే. ఈ మేరకు వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలోని డీసీబీబీ, కేజీబీ, యూనియన్ బ్యాంకులో జరిగిన ఆధార్ తప్పిదాలపై జిల్లా అసిస్టెంట్ రిజిస్ట్రార్ శుక్రవారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ కార్యాలయంలో క్రాప్ లోన్ తీసుకున్న రైతుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం అసిస్టెంట్ సబ్ రిజిస్ట్రార్ మాట్లాడుతూ అధికారుల తప్పిదం వల్ల 12 మంది రైతుల ఆధార్ నంబర్లు ఒకరివి మరొక రైతుకు నమోదు చేయడం వల్ల రుణమాఫీకి అనర్హులయ్యారని తెలిపారు. ఇలాంటి రైతులను రాష్ట్రవ్యాప్తంగా గుర్తించి బాధిత రైతులందరికి రుణమాఫీ వర్తించేలా రాష్ట్ర ప్రభుత్వం 32 ఫార్మెట్‌ను ఏర్పాటు చేసిందన్నారు. ఇందులో రైతులకు సంబంధించిన వివరాలను నమోదు చేసి ప్రభుత్వానికి నివేదించనున్నట్లు తెలిపారు. ఆధార్ నమోదు ప్రక్రియలో తప్పిదం జరిగి రుణమాఫీ వర్తించని ప్రతి రైతు సంబంధిత బ్యాంకుకు వెళ్లి వారి వివరాలను 32 ఫార్మెట్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. బాధిత రైతులు రుణమాఫీ కాలేదని అధైర్యపడవద్దని, ప్రతి ఒక్కరికి రుణమాఫీ వర్తించేలా కృషి చేయనున్నట్లు ఆయన హామీ ఇచ్చారు.

నల్లబెల్లి పీఏసీఎస్ కార్యాలయంలో విచారణ చేపడుతున్న జిల్లా అసిస్టెంట్ రిజిస్ట్రార్ కీరూనాయక్

ఆస్తి విషయంలో గొడవ

అన్న గొంతు కోసిన తమ్ముడు

ఎంజీఎం దవాఖానలో చికిత్స పొందుతున్న రాజు

కరీమాబాద్, ఆగస్టు2: ఆస్తి విషయంలో జరిగిన గొడవలో అన్నపై తమ్ముడు హత్యాయత్నం చేసిన ఘటన శుక్రవారం వరంగల్ రంగశాయిపేటలో జరిగింది. దీంతో స్థానికులు, బంధువులు ఎంజీఎం దవాఖానకు తరలించగా చికిత్స పొందుతున్నాడు. స్థానికుల కథనం ప్రకారం... రంగశాయిపేటకు చెందిన రావుల రాజేశ్‌ఖన్నా, అతని అన్న రావుల రాజుకు సంబంధించిన ఆస్తి విషయంలో కొంతకాలంగా వివాదం నెలకొంది. శుక్రవారం గొడవ పడగా తమ్ముడు రాజేశ్‌ఖన్నా అన్న రాజును బ్లేడ్‌తో గొంతు కోశాడు. దీంతో అతడికి తీవ్ర రక్తస్రావం కావడంతో వెంటనే ఎంజీఎం దవాఖానకుకు తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

చారిత్రక ఆధారాలపై నిర్లక్ష్యమేల ?

శిథిలమవుతున్న బయ్యారం శిలాశాసనం

కాకతీయ రాజుల చరిత్రకు నిలువుటద్దంలా నిలిచే శిలాశాసనం శిథిలమవుతున్నది. ప్రజలు కరువు కాటకాలకు గురికావద్దని గణపతిదేవుడి సోదరి మైలమాంబ బయ్యారంలో చెరువును నిర్మించగా వారి తల్లి బయ్యమాంబ పేరుతో బయ్యారంచెరువుగా నామకరణం చేశారు. కాకతీయుల చరిత్రను తెలియజేసే శిలాశాసనం చెరువు కట్టపై ఆదరణ లేక పడి ఉండడంతో 2013లో అప్పటి కలెక్టర్ సిద్ధార్థజైన్ ఈ శిలాశాసనాన్ని పునఃప్రతిష్ఠించారు. కాగా, వంశ చరిత్రను తెలిసేలా గ్రానైట్ రాతిపై తెలుగు అనువాదం చేసి ఉన్న పలకలు ధ్వంసమై శిలాశాసనం ఆనవాళ్లు కోల్పోతున్నది. భావితరాలకు చరిత్రను తెలియజెప్పే చారిత్రక ఆధారాలను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

- బయ్యారం, ఆగస్టు 2

కాకతీయుల చరిత్రను తెలియజేసే బయ్యారం శిలాశాసనం, (ఇన్‌సెట్) ధ్వంసమైన గ్రానైట్ పలకలు

ఓ తల్లి.. నరకయాతన

అనారోగ్యంతో మంచంపట్టిన వృద్ధురాలు

- చీమలు పీక్కుతింటున్నా కనికరం చూపని కొడుకులు
- వరంగల్ జిల్లా చంద్రుగొండలో ఘటన
- కొడుకులు, కోడళ్లకు సీడీపీవో కౌన్సెలింగ్
- బాగోగులను విస్మరిస్తే శిక్ష తప్పదని హెచ్చరిక

నెక్కొండ, ఆగస్టు 2: తల్లి మంచాన పడి నరకయాతన అనుభవిస్తున్నా ఆమె కొడుకులు పట్టించుకోలేదు. కాలివేళ్లకు పుండ్లు అయి చీమలు పీక్కుతింటున్నా కనీసం కనికరం చూపలేదు. పదిహేను రోజులుగా ఆ వృద్ధురాలు బాధ భరిస్తున్నా కుటుంబసభ్యులెవరూ దయలేకుండా వదిలేయగా.. ఇదేమిటని ప్రశ్నించినందుకు ఇరుగు, పొరుగుపైనే ఎదురుదాడికి దిగారు. ఈ దారుణ సంఘటన వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలో చంద్రుగొండలో శుక్రవారం వెలుగు చూసింది. విషయం తెలిసిన సీడీపీవో వారికి కౌన్సెలింగ్ ఇచ్చి వృద్ధురాలిని కొత్త ఇంట్లోకి తరలించడంతో పాటు ఆమె బాగోగులు పట్టించుకోకుంటే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వడ్డె కొమురమ్మ పెద్దకొడుకు, కోడలు పరమేశ్-విజయ వరంగల్‌లో నివాసం ఉంటుండగా, చిన్న కొడుకు, కోడలు కుమారస్వామి-పద్మలు చంద్రుగొండలోనే నివాసం ఉంటున్నారు. చిన్నకోడలు పద్మ గ్రామంలో అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేస్తోంది. కొద్ది రోజుల క్రితం వృద్ధురాలు జారి పడడంతో కాలు విరిగి తీవ్ర అనారోగ్యానికి గురైంది. ఇద్దరు కొడుకులు వరంగల్‌లోని చికిత్స చేయించి ఇక లాభం లేదనుకొని చంద్రుగొండకు తీసుకువచ్చారు. కొమురమ్మను పాత ఇంటి ముందు విరిగిన మంచంలో నివాసం ఉంచి పట్టించుకోవడం మానేశారు. దీంతో వృద్ధురాలు లేవలేక బెడ్‌మీదే ఉండడంతో వీపు తదితర భాగాల్లో పుండ్లయ్యాయి. స్నానం లేకపోవడం, పరిశుభ్రతలేకపోవడంతో చీమలు పట్టి కాళ్లను తినేస్తున్నాయి. అం